సాక్షి ఒడిశా

మంగళవారం । 7 । అక్టోబర్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,66,541లు, బంగారం 1 గ్రాము, వెండి 30గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ

గ్రీవెన్స్‌కు వినతులు వెల్లువెత్తాయి. అధికారులకు సమస్యలు విన్నవించారు.

- 8లో▸



వన్యప్రాణులను కాపాడాలి

వన్యప్రాణులను కాపాడుకోవాలని అటవీ శాఖాధికారులన్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.

- 8లో▸

న్యూస్‌రీల్

కార్తీక పూజలకు సన్నాహాలు

● భద్రత చర్యలపై పూరీ జిల్లా ఎస్పీ ఆదేశాలు



పోలీసు అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న పూరీ జిల్లా ఎస్పీ

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరంలో కార్తీక మాసం పవిత్ర పూజాదులు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా నెల రోజులపాటు కార్తీక వ్రతం ఆచరిస్తారు. ప్రధానంగా వితంతు మహిళలు నిష్ఠతో పూజలు చేస్తారు. రాష్ట్రంలో సుదూర ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో వ్రత దీక్ష చేపట్టిన మహిళలు తరలి వస్తారు. వీరి కోసం పూరీ శ్రీమందిరం అధికార యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంది. ఉచిత వసతి, జగన్నాథుని మహా ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం, వసతి నుంచి దేవస్థానం రాకపోకలకు ప్రత్యేక రవాణా, వసతి సముదాయంలో ఆరోగ్య సేవలు వంటి సుదపాయాలు కల్పిస్తారు. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ పట్ల పూరీ జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టి సారిస్తుంది. ఈ సన్నాహాలపై పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ముందస్తుగా సమీక్షించారు. అనుబంధ అధికారులు, సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.

కొండను ఢీకొట్టిన లారీ

● డ్రైవర్‌కు గాయాలు



ప్రమాద దృశ్యం

రాయగడ: విశాఖపట్నం నుంచి ఛత్తీస్‌గఢ్‌కు బొగ్గు లోడతో వెళ్తున్న లారీ అదుపుతప్పి కొండను ఢీ కొంది. సోమవారం ఉదయం జరిగిన ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలవ్వగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. స్థానిక మజ్జిగౌరి మందిరం సమీపంలోని జంఝావతి నదిపై గల బ్రిడ్జి మలుపులో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. లారీ ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. లారీలో ఇరుక్కుపోయిన డ్రైవరును అక్కడ ఉన్నవారు బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

ద్విచక్ర వాహన ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగ్రాతులు

జయపురం: ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి బొదాపుట్ గ్రామ పంచాయతీ రౌత్‌గుడ గ్రామ ప్రాంతంలో ఆదివాయం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. రౌత్‌గుడ వాసి మిథున్ జెన మల విసర్జన కోసం సమీప అటవీ ప్రాంతానికి వెళ్తున్న సమయంలో బొయిపరిగుడ వైపు వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వస్తూ ఢీకొట్టారు. దీంతో జెనతోపాటు ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. సమీపంలో ఉన్నవారు క్షతగాత్రులను బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వారిని మెరుగైన చికిత్స కోసం జయపురం పూల్‌బెడ గ్రామ ప్రాంతంలోగల కొరాపుట్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి రిఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నవంబర్ 11న నువాపడా ఉప ఎన్నిక

భువనేశ్వర్: నవంబర్ 11న నువాపడా శాసన సభ నియోజక వర్గం ఉప ఎన్నిక జరుగుతుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. ఈ మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ ప్రకటించారు. 13న నువాపడా ఉప ఎన్నిక నోటిఫికేషన్ ప్రచురిస్తామన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు నామినేషన్లు దాఖలుకు గడువు కేటాయించారు. గడువు లోగా దాఖలైన నామినేషన్ దస్తావేజులు అక్టోబర్ 22న పరిశీలించి అర్హులైన అభ్యర్థుల జాబితా వెల్లడిస్తారు. పోటీ నుంచి వైదొలిగేందుకు అక్టోబర్ 24న నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీగా ప్రకటించారు.

కటక్ నగరంలో కర్ఫ్యూ



కటక్ నగరంలో కర్ఫ్యూ ప్రభావం

● 36 గంటలపాటు కొనసాగింపు

భువనేశ్వర్: కటక్ మహా నగరంలో శాంతిభద్రతల వ్యవస్థ అస్తవ్యస్తమైంది. నగరంలో సమస్యాత్మక ప్రాంతాల్లో కర్ఫ్యూ ప్రకటించారు. దేవీ నవరాత్రులు ముగింపు పురస్కరించుకుని అనుపు ఊరేగింపులో చెలరేగిన వివాదాల వైపరీత్యం తాండవిస్తుంది. సోదరభావంతో కుల, మతాలకు అతీతంగా నగరంలో ప్రజలంతా కలిసి మెలిసి అన్యోన్యంగా ఏటా జరుపుకునే దుర్గా పూజలు ఈ ఏడాది ఆందోళనకరంగా మారడం విచారకరం. కటక్ నగరం సోదర భావం సంప్రదాయాన్ని పరిరక్షించడంలో నగర వాసులంతా సహకరించాలని రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్ వైబీ ఖురానియా విజ్ఞప్తి చేశారు.
రాష్ట్ర పోలీసులు శాంతిభద్రతలను కాపాడటానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నారని, సోషల్ మీడియాలో ప్రసారమయ్యే సమాచారాన్ని నమ్మవద్దని, పోలీస్ వెబ్‌సైట్‌లోని సమాచారాన్ని మాత్రమే నమ్మండని విజ్ఞప్తి చేశారు. సాంఘిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం, ప్రసారాల నివారణ దృష్ట్యా కొన్ని ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవల్ని తాత్కాలికంగా నిలిపి వేశారు. దీంతో పరిస్థితి ఆశించిన మేరకు అదుపులోకి రాకపోవడంతో నగర వ్యాప్తంగా 13 పోలీసు ఠాణాల పరిధిలో కర్ఫ్యూ విధించారు. ఆదివారం రాత్రి 10 గంటల నుంచి కర్ఫ్యూ అమలు చేసినట్లు స్పష్టం చేశారు. 36 గంటల పాటు కర్ఫ్యూ నిరవధికంగా కొనసాగుతుందని జంట నగరాల పోలీస్ కమిషనర్ ఎస్. దేవదత్త సింగ్ తెలిపారు.

కర్ఫ్యూ అమలు ప్రాంతాలు

నగర వ్యాప్తంగా 13 పోలీసు ఠాణాల పరిధిలో కర్ఫ్యూ విధించారు. ఆయా ప్రాంతాల్లో 36 గంటల పాటు కర్ఫ్యూ నిరవధికంగా కొనసాగుతుంది. దర్గా బజార్ పోలీస్ స్టేషన్, మంగళబాగ్, కంటోన్మెంట్, పూరీ ఘాట్ పోలీస్ స్టేషన్, లాల్‌బాగ్, బిడానాసి, మర్కత్ నగర్, సీడీఏ ఫేజ్ - 2, సదర్ పోలీస్ స్టేషన్, మాల్ గోదాం, బాదంబాడి, జగత్‌పూర్, బొయాలిస్ మౌజా ప్రాంతాలు కర్ఫ్యూలో ఉన్నాయి. వైద్య, అవసరమైన సేవలకు కర్ఫ్యూ నుంచి మినహాయింపు ఇచ్చారు. కటక్ నగరంలో కర్ఫ్యూ నిబంధనలో భాగంగా పెట్రోల్ పంపులు, బస్సులు, దుకాణాలు, బజార్లు, కటక్ గిడ్డంగులు మూసివేశారు. నగరం వైపు అమొ బస్సు (సిటీ బస్సు) సేవల్ని నిలిపి వేశారు. నగరంలో ప్రధాన బస్టాండ్ నుంచి బయట ప్రాంతాలకు వెళ్లే ప్రైవేటు బస్సుల రవాణా, జాతీయ రహదారిపై సాధారణ రవాణా, వైద్య సౌకర్యాలు యథాతథంగా పని చేస్తాయి. ప్రస్తుతానికి మంగళ వారం ఉదయం 10 గంటల వరకు కర్ఫ్యూ ఆంక్షలు అమల్లో ఉన్నాయి. పరిస్థితి పురోగతి ఆధారంగా కర్ఫ్యూ సడలింపు, తొలగింపు లేదా పొడిగింపు ఆధారపడి ఉంటుందని నగర పోలీసు కమిషనరేటు తెలిపింది.



వై. బి. ఖురానియా, డీజీపీ

నువాపడాకు విలువైన ప్రాజెక్టులు ప్రకటించిన సీఎం

భువనేశ్వర్: నువాపడా ప్రాంతానికి ముఖ్యమంత్రి రూ.1100 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రకటించారు. ఈ నియోజక వర్గానికి ఉప ఎన్నిక జరగనుంది. జాతీయ ఎన్నికల సంఘం నువాపడా నియోజక వర్గం ఉప ఎన్నిక తేదీ ప్రకటించిన కొన్ని గంటలు ముందుగా ముఖ్యమంత్రి విలువైన ప్రాజెక్టులు ప్రకటించడం విశేషం. సోమవారం ఉప ఎన్నిక తేదీ ప్రకటించారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ నువాపడా జిల్లా పర్యటన సందర్భంగా రూ. 1,101 కోట్ల విలువైన 957 ప్రాజెక్టులను ప్రారంభించి ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించిన ముఖ్యమంత్రి, సమతుల్య ప్రాంతీయ పురోగతికి రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి రూ. 64.02 కోట్ల విలువైన 109 పూర్తయిన ప్రాజెక్టులను అంకితం చేశారు, రూ. 159.76 కోట్ల విలువైన 39 కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు. రూ. 75.37 కోట్ల విలువైన కొత్త పథకాలను ప్రకటించారు. వ్యవసాయానికి పెద్ద ఊతం ఇస్తూ, నువాపడా జిల్లా అంతటా వ్యవసాయ భూములకు నీటి సరఫరాను నిర్ధారించే లక్ష్యంతో రూ. 802.09 కోట్ల విలువైన నీటిపారుదల ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. ముఖ్యమంత్రి మోహన్ మాఝి ఖరియార్ రోడ్డును మున్సిపాలిటీగా ప్రకటించారు. కొమనా మండలానికి ఎన్ఏసీ హోదా మంజూరు చేయగా, సినాపలి, గొదాల్ గ్రామ పంచాయతీలను విలీనం చేసి కొత్తగా సినాపలి నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్ (ఎన్ఏసీ) ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని అన్ని తహసీళ్లలో సబ్-రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ప్రారంభిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. 317 తహసీళ్లలో, 210 తహసిల్ పరిధిలో సబ్-రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ప్రారంభం అయ్యాయి. 107 కొత్తవి త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



కారును బయటకు తీస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి కేంద్రంలో ఉన్న కన్యాశ్రమ వంతెన వద్ద ఆదివారం రాత్రి 10:30 గంటల సమయంలో కారు అదుపు తప్పింది. డ్రైవర్ చాకచక్యంతో కారును నీటిలో పూర్తిగా పడకుండా తన యజమానిని రక్షించాడు. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వచ్చిన వారు ఇద్దరినీ కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కారు పోడియా నుంచి కలిమెల వైపు వస్తుంది. కారును తాళ్ల సహాయంతో బయటకు తీశారు.

ప్రాణనాథ్ పట్నాయక్ నిబద్ధత స్ఫూర్తిదాయకం: గవర్నర్



ప్రాణనాథ్ పట్నాయక్ వర్ధంతి సభలో గవర్నర్ ప్రసంగం



ప్రాణనాథ్ పట్నాయక్ వర్ధంతి సభకు హాజరైన ప్రముఖులు

భువనేశ్వర్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు దివంగత ప్రాణనాథ్ పట్నాయక్ 55వ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరి బాబు కంభంపాటి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్థానిక జయదేవ్ భవన్‌లో రాష్ట్ర ప్రణనాథ్ స్మారక కమిటీ నిర్వహించిన స్మారక కార్యక్రమంలో గవర్నర్ ప్రసంగించారు. ఆయనను ఒక దార్శనికుడిగా అభివర్ణించారు, ఆయన ఆదర్శాలు, న్యాయం, సమానత్వం, సామాజిక సంక్షేమం పట్ల అచంచలమైన నిబద్ధత భావి తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయన్నారు. ప్రాణనాథ్ పట్నాయక్ నిర్భయ స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాదు, మార్గదర్శక సోషలిస్ట్, రాజకీయ ఆలోచనాపరుడు, సామాజిక సంస్కర్త, రచయిత, విద్యావేత్త, ప్రజలకు అంకితభావంతో కూడిన సేవకుడు అని కొనియాడారు. భారత దేశం రాజకీయ స్వేచ్ఛను సాధించినప్పటికీ పేదరిక నిర్మూలన, అసమానతలను తొలగించడం మరియు సమ్మిళిత అభివృద్ధిని నిర్ధారించడం వంటి సవాళ్లు ముఖ్యమైనవిగా ఉన్నాయని గవర్నర్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంలో, ప్రాణనాథ్ పట్నాయక్ ఆదర్శాలు మన ప్రయత్నాలకు మార్గదర్శక వెలుగుగా పనిచేస్తాయన్నారు. విద్యను అందరికీ హక్కుగా, రాజకీయాలను సేవ యొక్క విధిగా, నాయకత్వం ప్రజలతో పాటు వారి పోరాటాలలో నడవడిగా ప్రాణనాథ్ పట్నాయక్ భావించారని గవర్నర్ ప్రశంసించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వారిలో రాష్ట్ర న్యాయ, అబ్కారీ శాఖ మంత్రి పృథ్వి రాజ్ హరిచందన్, లోక్ సేవక్ మండల్ జాతీయ ఉపాధ్యక్షుడు దీపక్ మాలవ్య, మాజీ పార్లమెంటు సభ్యుడు, సంబాద్ మరియు అమొ ఒడిశా వ్యవస్థాపక చైర్మన్ సౌమ్య రంజన్ పట్నాయక్ మరియు కిట్, కిస్ మరియు కిమ్స్ వ్యవస్థాపకుడు అచ్యుత సామంత ఉన్నారు.

లక్ష్మీ ఇందిర పండాకు ఘనంగా నివాళులు



లక్ష్మీ ఇందిర పండాకు శ్రద్ధాంజలి ఘటించిన పూజ్య పూజ సంసద్ సభ్యులు



స్వాతంత్ర్య యోధురాలు లక్ష్మీ ఇందిర పండా విగ్రహానికి పూల మాల వేస్తున్న అధ్యక్షుడు కేదారనాథ్ బెహర

జయపురం: సుభాష్ చంద్రబోస్ ఆర్మీలో సేవలు అందించిన జయపురం మహిళ లక్ష్మీ ఇందిర పండాకు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. సోమవారం లక్ష్మీ ఇందిర పండా వర్ధంతి సందర్భంగా పట్టణంలో 26 వ జాతీయ రహదారి లక్ష్మీపండ జంక్షన్‌లో గల ఆమె నిలువెత్తు ప్రతిమకు పూజ్య పూజ సంసంద్ సభ్యులు నివాళులు అర్పిస్తూ ఒక కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్వర్గీయ లక్ష్మీ ఇందిరా పండ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పూజ్య పూజ సంసద్ అధ్యక్షుడు ఇంజినీర్ కేదారనాథ్ బెహరా మాట్లాడుతూ నేతాజీ ఇండియన్ ఆర్మీలో సేనాపతిగా ఆమె సాగించిన పోరాటం చిరస్మరణీయం అని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఆమె విగ్రహానికి పాలకులు సముచిత గౌరవం ఇవ్వడం లేదని విమర్శించారు. ఆంగ్లేయుల పాలన నుంచి దేశాన్ని విముక్తి జరిపేందుకు వీరత్వంతో పోరాడిన లక్ష్మీ ఇందిర పండాకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జయపురం పూజ్య పూజ సంసద్ కార్యదర్శి, తపన్ త్రిపాఠీ, కేషియర్ భైరవ సాహుతో పాటు సమాజ సేవి ప్రమోద్ కుమార్ రాళో, పాత్రికేయులు నరసింహ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

శాసన సభ స్పీకర్ విదేశీ పర్యటన

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభ స్పీకర్ సురమా పాఢి విదేశీ పర్యటనకు బయల్దేరారు. ఈ పర్యటనలో భాగంగా ఈ నెల 12వ తేదీ వరకు బార్బడోస్ బ్రిడ్జిటౌన్‌లో జరిగే 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ సమావేశం (సీపీసీ)లో భారత పార్లమెంటరీ ప్రతినిధి బృందంతో కలిసి పాల్గొంటారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆధ్వర్యంలో రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, 22 రాష్ట్రాల పార్లమెంటు సభ్యులు, స్పీకర్లు, డిప్యూటీ స్పీకర్లు, కార్యదర్శులతో కూడిన భారత ప్రతినిధి బృందంలో ఒకరుగా రాష్ట్ర శాసన సభ స్పీకరు సురమా పాఢి ఈ కార్యక్రమానికి హాజరు కావడం విశేషం. కామన్వెల్త్ పార్లమెంటేరియన్ల అతి పెద్ద వార్షిక సమావేశంలో భారత దేశం సంప్రదాయం, సాంకేతికత సమ్మేళనంతో సమతుల్య పాలనా నమూనాను ప్రదర్శిస్తుంది. లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా ఈ కార్యక్రమం జనరల్ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగిస్తారు. భారతదేశ ప్రజాస్వామ్య విలువలను, పార్లమెంటరీ వ్యవహారాల సమన్వయం ప్రధాన శీర్షికగా ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా సందర్భంగా జరగనున్న 9వ కామన్వెల్త్ మహిళా పార్లమెంటేరియన్ల సమావేశానికి స్పీకరు సురమా పాఢి హాజరవుతారని తెలిపారు. 56 సభ్య దేశాలతో కూడిన సీపీసీ సభ్యులు ఈ కార్యక్రమాల్లో పాలుపంచుకుంటారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

పర్లాకిమిడి:

గజపతి జిల్లా రాయగడ బ్లాక్ గంగాబడ పంచాయతీ ముంతవీధిలో విద్యుత్ ఘాతంలో బారిక్ శోబోరో (45) రైతు మృతి చెందగా, మరో వ్యక్తి నరేంద్ర శోబోరో విద్యుత్ షాక్‌తో పర్లాకిమిడి మెడికల్‌లో చికిత్స పొందుతున్నాడు. గారబంద ఎస్ఐ తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. గంగాబడ పంచాయతీ ముంత వీధికి చెందిన బారిక్ శోబోరో పొలానికి సాగునీరు పెట్టడానికి వెళుతుండగా ఆదివారం మోటారు పంపు సర్వీసు వైరు ఒక ఎదురు కర్రకు వేలాడుతుండగా దాన్ని ముట్టుకున్న బారిక్ శోబోరో విద్యుత్ షాక్ తగిలి పడిపోయాడు. వెంటనే బారిక్ శోబోరోను కోయిపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తరలించి ప్రథమ చికిత్స చేశారు. అయితే అప్పటికే బారిక్ మృతి చెందాడు. అతనితో వచ్చిన నరేంద్ర శోబోరోను పర్లాకిమిడి కేంద్ర ఆస్పత్రికి తరలించగా ఆయన బతికి బయటపడ్డాడు. రాయగడ బీడీఓ సంతోష్ కుమార్ బారిక్ మృతుడు బారిక్ శోబోరో కుటుంబానికి రూ.20 వేలు తక్షణ సాయం చేశారు.




విద్యుత్‌ఘాతానికి మృతిచెందిన బారిక్ శోబోరో

జేకేపూర్‌లో కొనసాగుతున్న దసరా ఉత్సవాలు



పూజలందుకుంటున్న అమ్మవారు



కేదార్‌నాథ్ తరహా పూజా పెండాల్



ఆర్కెస్ట్రాలో గాయనీ, గాయకులు



సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న జేకేపేపర్ మిల్ అధికారులు, సిబ్బంది

రాయగడ:

పారిశ్రామిక కేంద్రం జేకేపూర్‌లో గత నెల 28వ తేదీన ప్రారంభమైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలను తిలకించేందుకు పరిసర ప్రాంతాలకు చెందిన వేలాది మంది తరలివస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రతీ ఏడాదిలా ఈసారి కూడా జేకేపేపర్ మిల్ పరిశ్రమ యజమాన్యం నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా కేదార్‌నాథ్ మందిరం తరహా ఏర్పాటు చేసిన పూజా పెండాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉత్సవాలను తిలకించేందుకు వచ్చిన భక్తులు పెండాల్ వద్ద సెల్ఫీలు తీసుకుని ఆనందాన్ని పొందుతున్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో పెట్టుకుని ఆనందించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఆర్కెస్ట్రాలో టీవీ ఛానల్ గాయనీ గాయకులు హాజరై జనాలను ఉర్రూతలూగించగా ప్రముఖ గాయకులు, ఇండియన్ ఆడిల్ శ్రీనివాస్ ధామిశెట్టి, అదితి భార్గవరాజులు తమ పాటలతో ప్రేక్షకులను మైమరపించారు. ఉత్సవ కమిటీ సభ్యులు వచ్చే భక్తులను, ప్రేక్షకులను సాదరంగా ఆహ్వానిస్తుండటం విశేషం. ఇదిలాఉండగా ఉత్సవ మైదానంలో ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మంగళవారంతో ఉత్సవాలు ముగుస్తాయని కమిటీ సభ్యులు తెలిపారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గౌరీపౌర్ణమి



గౌరీదేవికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

రాయగడ: గౌరీపౌర్ణమి సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్థానిక కంద్రవీధి, జగన్నాథ మందిరం వెనుక, మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న నందన్న పూజల్లో భాగంగా శివపార్వతులకు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు గౌరీదేవీ వ్రతం చేశారు. పండ్లు, ఫలాలు, చీరలు, గాజులను శివపార్వతులకు సమర్పించారు. మొక్కులను తీర్చుకున్నారు.

హత్య చేస్తామంటూ బెదిరింపులు!

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ తోలోసాహి ప్రాంతానికి చెందిన భైరవ సాహు అనే వ్యక్తిని గత ఏప్రిల్ 21వ తేదీన చేతబడి చేస్తున్నాడన్న ఆరోపణతో కొందరు గ్రామస్తులు హత్య చేశారు. ఈ నేపథ్యంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు అందుకు సంబంధించి కొందరు గ్రామస్తులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అయితే జైలు నుంచి తిరిగి వచ్చిన నిందితులు తమను ఎలాగైన హత్య చేస్తామని బెదిరిస్తున్నారని భైరవ సాహు కుటుంబీకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం నాడు వినతుల స్వీకరణలో భాగంగా బాధిత కుటుంబీకులు ఈ మేరకు కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. హత్యకు గురైన భైరవ సాహు భార్య సంజు సాహు, కొడుకు జీతు సాహు, కూతురు రస్మి సాహు తదితర కుటుంబ సభ్యులు కలెక్టర్‌ను కలసి తమ గోడును విన్నవించుకున్నారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్ కులకర్ణి, ఎస్పీ స్వాతి ఎస్ కుమార్ దీనిపై దర్యాప్తు చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

ప్రాణాలు తీసిన విద్యుత్ తీగలు



చంటి మృతదేహం

మెళియాపుట్టి: మండలంలోని గంగరాజపురం గ్రామానికి చెందిన యువకుడు గూడపు చంటి(29) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని మున్నాజెన్నా అనే వ్యక్తి ఇంటిపై చెట్టుకొమ్మలు విద్యుత్ తీగలకు తగిలి ఉండడంతో ఒడిశాలోని జంగాలపాడు గ్రామానికి చెందిన శరత్ అనే యువకుడు మృతుడు చంటిని ఆ కొమ్మలు తొలగించడానికి సాయంగా రమ్మన్నాడు. దీంతో విద్యుత్ సరఫరా ఉండగానే చెట్టు కొమ్మలను చంటి తొలగిస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అక్క దమయంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. తల్లిదండ్రులు కొద్దికాలం క్రితమే మృతి చెందారు. అతడు విజయవాడలోని ఒక ప్రైవేట్ కంపెనీలో వెల్డింగ్ కార్మికునిగా పనిచేసేవాడు. ఇటీవల వినాయక చవితికి గ్రామానికి వచ్చాడు. మంగళవారం విజయవాడ బయల్దేరి వెళ్లడానికి సిద్ధమవ్వగా.. ఇంతలో ప్రమాదం చోటుచేసుకోవడంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కంచిలి: మండలంలోని గొల్ల కంచిలి నుంచి కంచిలి వెళ్లేమార్గంలో మఠం చెరువు సమీపంలో రైల్వేట్రాక్‌పై సుమారు 55 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయాన్ని పలాస జీఆర్పీ పోలీసులు సోమవారం గుర్తించారు. ప్రమాదంలో మృతుని ముఖం గుర్తుపట్టలేని విధంగా తయారైంది. మృతుడి శరీరంపై ఆరెంజ్, తెలుపు రంగు కలిగిన గడుల తువ్వాలు మాత్రమే ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు 94406 27567, 99891 36143 నంబర్లను సంప్రదించాలని కోరారు.

తప్పిన పెను ప్రమాదం



మృతి చెందిన ఆవు

జి.సిగడాం: మండలంలోని మద్రివలస పంచాయతీ మానంపేట గ్రామంలో ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో విద్యుత్ తీగ తెగిపడిన సమయంలో పెను ప్రమాదం తప్పింది. గ్రామానికి చెందిన బాధిత కనకలక్ష్మికి చెందిన ఆవుకు విద్యుత్ తీగ తగలడంతో మృత్యువాత పడింది. ఇదే సమయంలో కనకలక్ష్మికి సైతం విద్యుత్ తీగ తగలడంతో షాక్‌కు గురయింది. వెంటనే గ్రామస్తులు అప్రమత్తమై కర్రలతో విద్యుత్ తీగను తొలగించారు. అనంతరం ఆమెను హుటాహుటిన రాజాం ఆస్పత్రికి తరలించారు. ఆమె ప్రస్తుతం చికిత్స పొందుతోంది. వ్యవసాయం కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ మానంపేట మీదుగా ఉండడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వ్యవసాయ కోసం ఏర్పాటు చేసిన లైన్లు మార్చాలని కోరుతున్నారు.

గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ

పర్లాకిమిడి:

జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జాయింట్ గ్రీవెన్స్ సెల్‌కు అధిక స్పందన లభించింది. జిల్లా కలెక్టర్ మధుమిత పాల్గొని వినతులు స్వీకరించారు. జిల్లా ఎస్పీ జ్యోతింద్ర పండా, డీఎఫ్ఓ కె.నాగరాజు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి శంకర కెరకెటా, తహసీల్దార్ నారాయణ బెహరా, సబ్ కలెక్టర్ అనుప్ పండా పాల్గొన్నారు. కెరండి, సిద్ధమణుగు, పర్లాకిమిడి పురపాలక, రాణిపేట గ్రామ పంచాయతీల నుంచి 57 వినతులు అందాయి. వీటిలో వ్యక్తిగతం 37, గ్రామ సమస్యలకు సంబంధించినవి 21 ఉన్నాయి. వాటిని సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.



పర్లాకిమిడి: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మధుమిత, అధికారులు



రాయగడ: సమస్యలు వింటున్న కలెక్టర్ కులకర్ణి

రాయగడలో..

రాయగడ: స్థానిక డీఆర్‌డీఏ సమావేశం హాల్‌లో సోమవారం జిల్లా యంత్రాంగం నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో కలెక్టర్ అశుతోష్ కులకర్ణి పాల్గొన్నారు. 55 వినతులను స్వీకరించారు. ఇందులో 47 వ్యక్తిగతమైనవి, మరో 8 గ్రామ సమస్యలుగా గుర్తించారు. ఏడుగురుకి ఆరోగ్య సమస్యలకు సంబంధించి రెడ్ క్రాస్ నిధుల నుంచి రూ. 25 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. స్వీకరించిన వినతులను త్వరితగతిన పరిష్కరించేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, డీఎఫ్ఓ అన్నా సాహెబ్ ఆహోలే, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండొ, సబ్ కలెక్టర్ రమేష్ కుమార్ జెన్నా, జిల్లా ముఖ్యవైద్యాధికారి సరోజినిదేవి, తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను కాపాడుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా అటవీ అధికారి అహోలే

- జిల్లా అటవీ శాఖ అధికారి అన్నా సాహెబ్ అహోలే

రాయగడ: వన్యప్రాణులు అంతరించి పోతున్నాయని వీటిని కాపాడుకోవడం మన కర్తవ్యమని జిల్లా అటవీ శాఖ అధికారి అన్నా సాహెబ్ అహోలే అన్నారు. జాతీయ వన్య ప్రాణుల వారోత్సవాల సందర్భంగా అటవీ శాఖ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అడవుల్లో ఉండే వన్యప్రాణుల జాతి అంతరించి పోతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. కొంతమంది స్వార్థపరులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం వన్యప్రాణులను వేటాడి హతమారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే అడవుల్లోని పచ్చని చెట్లు నరికి వేస్తుండటంతో వన్యప్రాణులు జనారణ్యంలోకి వచ్చి ప్రాణాలు కోల్పోతున్నాయన్నారు. వన్యప్రాణుల సంరక్షణపై అందరూ అవగాహన కలిగి ఉండాలని అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ అశోక్ కుమార్ ప్రధాన్ అన్నారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల మధ్య పోటీలను నిర్వహించారు.

విజేతల వివరాలు

జలచర ప్రాణులకు సంబంధించి నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో సీనియర్ విభాగంలో తపస్విని కద్రక ప్రథమ బహుమతిని గెలుచుకోగా సామిరాణి గౌడో ద్వితీయ, పారిస్మిత బిడిక తృతీయ బహుమతులను గెలుపొందారు. జూనియర్ విభాగంలో స్మృతి బెహర, బిందీయ సబర్, అభ్యాస్ ప్రధాన్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు అటవీ శాఖ అధికారి అహోలే బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రాయగడ రేంజర్ కామేశ్వర్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ యాత్రికునికి ఘన స్వాగతం



సైకిల్ యాత్రికుడు అబబుల్లా సాలిమ్ షేఖ్‌ను స్వాగతిస్తున్న బొయిపరిగుడ ఆటో డ్రైవర్లు

జయపురం: అఖిల భారత్ అంతా సైకిల్ యాత్ర జరుపుతూ జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ చేరిన తమిళనాడుకు చెందిన ఆటో డ్రైవర్ అబబుల్లా సాలిమ్ షేఖ్‌కు బొయిపరిగుడ ఆటో డ్రైవర్ల మహా సంఘం సోమవారం ఘన స్వాగతం పలికింది. అబబుల్లాసాలీమ్ షేఖ్ మాట్లాడుతూ.. దేశంలో డ్రైవర్ల సురక్ష, గుర్తింపు కోసం తాను సైకిల్ యాత్ర చేపట్టానని వెల్లడించారు. దేశంలో డ్రైవర్లను సమైఖ్యపరచేందుకు తాను కృషి చేస్తానన్నారు. డ్రైవర్ల సమస్యలను కేంద్ర, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆ లక్ష్యంతో తాను ఆగస్టు 16వ తేదీన సైకిల్ యాత్ర తమిళనాడులో ప్రారంభించానన్నారు. ఇంతవరకు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో సైకిల్ యాత్ర పూర్తి చేసుకుని బొయిపరిగుడ వచ్చినట్లు తెలిపారు. తాను దేశంలో అన్ని రాష్ట్రాల్లోనూ సైకిల్ యాత్ర జరుపుతానని, తన సైకిల్ యాత్రలో ప్రభుత్వాల వద్ద మూడు డిమాండ్‌లు ఉంచుతున్నానన్నారు. ప్రమాద బీమా క్లెయిమ్ వెంటనే చెల్లించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కార్డుపై రెండు లక్షల రుణంతో పాటు సబ్సిడీ సౌకర్యం కల్పించాలని, నిరుపేద డ్రైవర్ల పిల్లలు చదువుకునేందుకు అన్ని ఉచిత సౌకర్యాలు కల్పించి, వారి విద్యాప్రగతికి నూతన పథకం అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా అతడిని బొయిపరిగుడ ఆటో మహా సంఘ కార్యకర్తలు కలిసి అతడి ఆశయాన్ని కొనియాడారు.

ఏడు సమితుల పరిధిలో ఆది కర్మయోగి కార్యక్రమాలు

- అధికారుల వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ మధుమిత

పర్లాకిమిడి: వికసితభారత్, వికసిత్ జిల్లా విజన్–2030 లక్ష్యంగా గజపతి జిల్లాలో ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమాలను ఏడు సమితి కేంద్రాలు, 435 గ్రామాలలో 8,700 మంది ఆదిసాథీలతో నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ మధుమిత వెల్లడించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలియజేశారు. గిరిజన, ఆదివాసీ ప్రజలకు మౌలిక సమస్యలు, విద్య, వైద్య, రవాణా, తాగునీరు, అంగన్‌వాడీ, పోషక ఆహారం, స్వయం ఉపాధికి పథక రచన చేస్తున్నామని అన్నారు. ఇదోక నూతన ప్రక్రియ అని, ప్రముఖ ఆదివాసీ మహిళ బిర్సా ముండా 140 జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివాసీ సంప్రదాయ గ్రామాలు వికాసానికి ప్రధాని నరేంద్ర మోదీ ఈ పథకం ప్రవేశపెట్టారని కలెక్టర్ అన్నారు. దేశంలో 30 రాష్ట్రాలు, 550 జిల్లాలు, 300 కంటే ఎక్కువ సమితి కేంద్రాల్లో, ఒక లక్ష గ్రామాలు 2030 లోగా వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దడానికి నడుం కట్టారని అన్నారు. గజపతి జిల్లాలో ఏడు సమితి కేంద్రాలు, 435 గ్రామాల్లో ఐదు సామాజిక సేవాకేంద్రాలు నిర్మిస్తున్నామని అన్నారు. దీనికోసం జిల్లాలో 8,700 మంది ఆదిసాథీలను నియమించామని కలెక్టర్ అన్నారు. సెప్టెంబర్ 27 నుంచి గాంధీ జయంతి వరకూ ఆదికర్మయోగి అభియాన్ ప్రోగ్రెస్‌ను తెలియజేశారు. జిల్లా ఎస్పీ జ్యోతింద్ర పండా, డీఎఫ్‌వో కె.నాగరాజు, ఐటీడీఏ ప్రాజెక్టుఅధికారి అంశుమాన్ మహాపాత్రో పాల్గొన్నారు.

పీపీపీ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని దళిత, ఆదివాసీ, బహుజన, మైనార్టీ సంఘాల జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహరనాయుడు ఆధ్వర్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులను వైద్య విద్యకి దూరం చేసే విధానాలు ప్రభుత్వం విడనాడాలని కోరారు. ప్రభుత్వమే మెడికల్ కాలేజీలు నిర్వహించాలని విన్నవించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధపడడం దుర్మార్గమని మండిపడ్డారు. లక్షల కోట్లు అప్పులు చేస్తున్న ప్రభుత్వం, మెడికల్ కాలేజీల కోసం అవసరమైన నిధులు ఖర్చు చేయలేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ ఉద్యమంలో పాల్గొనేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు తైక్వాండో శ్రీను, డా.కంతవేణు, ఎస్.వి.రమణ మాదిగ, మహిబుల్లా ఖాన్, అమిరుల్లా బేగ్, రౌతు శంకరరావు, బాడాప దేవభూషణరావు, గుండబాల మోహన్, ఎంఏ బేగ్, పొన్నాడ రుషి, ముంజేటి కృష్ణమూర్తి, యజ్జల గురుమూర్తి, వైశ్యరాజు మోహన్, గద్దెబోయిన కృష్ణారావు, నీలాపు ముకుందరావు, నల్లబారిక శ్రీను, పెయ్యల చంటి, అబ్బాస్, సింకు రమణ, అరిబారిక రాజు, నేతల అప్పారావు, కొత్తూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యమే భవిష్యత్‌కు పునాది



కంచిలి: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఆహార కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి

కంచిలి/సోంపేట/మందస/టెక్కలి: విద్యార్థుల ఆరోగ్యం, ఆహార భద్రతే దేశ భవిష్యత్‌కు పునాది అని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయ ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం పలు హాస్టళ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, చౌక ధరల దుకాణాలను ఆకస్మికంగా ఆయన పరిశీలించారు. విద్యార్థులకు సక్రమంగా నాణ్యమైన భోజనం అందుతుందో లేదోనని తెలుసుకున్నారు. సోంపేట మండలంలోని వాడపాలెం వసతి గృహంలో విద్యార్థులకు వారానికి రెండు గుడ్లు అందజేస్తున్నారని విద్యార్థులు తెలపడంతో.. ఇన్‌చార్జి వార్డెన్ విజయలక్ష్మికి షోకాజ్ నోటీసులు అందజేయమని వెనుకబడిన తరగతుల జిల్లా సంక్షేమాధికారి బి.అనురాధకు ఆదేశాలు జారీ చేశారు. వసతి గృహాల్లో మెనూ సక్రమంగా అమలు చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనల మేరకు విద్యార్థులకు ఇచ్చే గుడ్ల సైజ్ ఉండాలని స్పష్టం చేశారు. స్టాక్ నిర్వహణ సక్రమంగా ఉండాలని, అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని, అవసరమైతే సుమోటోగా కేసులు నమోదు చేస్తామని వివరించారు. విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు డీఎస్ఓ సూర్యప్రకాశ్, ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రీరాములు, తూనికలు కొలతల శాఖాధికారి పి.చిన్నమ్మి తదితరులు ఉన్నారు.

ద్విచక్ర వాహనం దొంగకు జైలు శిక్ష

నరసన్నపేట: ద్విచక్ర వాహనం దొంగతనం కేసులో సారవకోట మండలం బుడితికి చెందిన కొర్ల శివకు ఆరు నెలల జైలుశిక్ష, రూ.500ల జరిమానాను నరసన్నపేట జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి విధించారు. వివరాల్లోకి వెళ్తే.. ఎచ్చెర్ల మండలం యాతపేటకు చెందిన సోడి పైడిరాజు ద్విచక్ర వాహనం నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పార్క్ చేయగా చోరీకి గురైంది. ఈ మేరకు ఈ ఏడాది మే 30న నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కొర్ల శివను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో చార్జిషీట్ పోలీసులు వేయగా, నరసన్నపేట జూనియర్ సివిల్ జడ్జి విచారణ చేపట్టారు. సోమవారం కొర్ల శివను దొంగగా నిర్ధారించి జైలుశిక్ష ఖరారు చేశారు. కేసులో ఏపీపీగా శాంతి సంతోషి వ్యవహరించారు. ఈ మేరకు నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు.

ఆత్మహత్య చేసుకొని మహిళ మృతి

పలాస: మందస మండలం మఖరజోల గ్రామ పంచాయతీ పరిధి అల్లిమెరక కాలనీలో నివాసముంటున్న కొండ కురమ్మ (22) సోమవారం పలాస మండలం రంగోయి గేటు సమీపంలోని ఒక జీడి తోటలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కురమ్మ తల్లి గాది పద్మ, కాశీబుగ్గ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కురమ్మ భర్త చంద్రశేఖర్ కత్తర్‌కు వలస కూలీగా గతేడాది వెళ్లాడు. కురమ్మకు కడుపులో నొప్పి ఉంది. ఇటీవల సోంపేట మండలం జురాబంద గ్రామంలో ఉన్న తన తల్లి వద్దకు వెళ్లింది. కడుపులో నొప్పి ఉందని చెప్పడంతో సోంపేటలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చూపించారు. కన్నవారి ఇంటి నుంచి వచ్చిన కురమ్మ ఇంతలోనే ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ ఎస్ఐ ఆర్ నరసింహమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్తతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఎస్పీ గ్రీవెన్సుకు 36 వినతులు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఎస్పీ గ్రీవెన్సుకు 36 వినతులు అందాయి. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సకాలంలో న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

లేడీ రౌడీ షీటర్‌పై ఎస్పీకి ఫిర్యాదు




ఫిర్యాదు చేసేందుకు వచ్చిన గ్రామస్తులు

శ్రీకాకుళం క్రైమ్: సరుబుజ్జిలి మండలంలోని మూలసవలాపురానికి చెందిన లేడీ రౌడీషీటర్, ఆమె అనుచరులపై అదే గ్రామానికి చెందిన కొంతమంది ఎస్పీ మహేశ్వరరెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్సుకు వచ్చి తమ గోడు వెల్లబోసుకున్నారు. దందాలు, రౌడీయిజం, సారా, మద్యం, గంజాయి, మాదకద్రవ్యాలు, భూ, ఇళ్ల స్థలాల కబ్జాలు జిల్లా నలుమూలలు చేస్తూ గ్రామ పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని బ్యాంకర్స్ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్న జామి రమేష్ తరపున మధ్యవర్తి సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్నది ఈమె అనుచరులేనన్నారు. అర్ధరాత్రి ఇంటి యజమాని తంగుడు ఉపేంద్ర ఇంట్లో చొరబడి దౌర్జన్యానికి పాల్పడేందుకు యత్నించగా.. స్థానికులు దేహశుద్ధి చేయడంతో వెనుదిరిగారని తెలిపారు. అనేక పోలీస్‌స్టేషన్లలో వీరిపై కేసులున్నాయని పేర్కొన్నారు. ఫిర్యాదు ఇచ్చిన వారిలో కె.ధనుంజయ, జి.మోహనరావు, ఎస్.వసంత్‌కుమార్, జి.శ్రీధర్ మరో 30 మందికి పైగా ఉన్నారు. కాగా వీరు ఫిర్యాదు చేసిన కొద్ది గంటల్లోనే అవతలి వర్గం వాళ్లు ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. అక్కడికి కొద్ది క్షణాల్లోనే టౌన్ డీఎస్పీ వివేకానంద, ఒకటో పట్టణ సీఐ పైడపునాయుడు, జె.ఆర్.పురం సీఐ అవతారం ఎస్పీని కలిసేందుకు రావడం చర్చనీయాంశంగా మారింది.

మాకు అదే పనేంటి..?

- జేఆర్‌పురం సీఐ అవతారం సమాధానం వైరల్



వాట్సాప్‌లో వైరల్ అవుతున్న ఆడియో క్లిప్

రణస్థలం: భజరంగ్ దళ్ జిల్లా కార్యదర్శి కె.కిరణ్‌కుమార్ శ్రీకాకుళం వైపు నుంచి ఎచ్చెర్ల జాతీయ రహదారి మీదుగా వ్యాన్‌లో ఆవుల అక్రమ రవాణా జరుగుతోందని జేఆర్‌పురం సీఐ అవతారంనకు కాల్ చేయగా మాకు ఇప్పుడు అదే పనేంటి అని సీఐ మాట్లాడిన కాల్ రికార్డింగ్‌ను భజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు సోషల్ మీడియాలో సోమవారం వైరల్ చేశారు. కాల్ రికార్డులో ఉన్న సారంశం ప్రకారం ఫోన్ చేసిన వ్యక్తికి స్పందించిన సీఐ అవతారం మాట్లాడుతూ హలో ఎవరూ చెప్పండి అన్నారు. అవతల వ్యక్తి.. సార్ ఆవుల వ్యాన్ ఒకటి వస్తుందని అనగానే మాకు అదే పనేంటి ఇప్పుడు అని ఫోన్ కట్ చేశారు. దీనిపై సీఐ ఎం.అవతారం వివరణ కోరగా.. సాధారణంగా కంట్రోల్ రూమ్‌కు కాల్ చేయాలన్నారు. ఎచ్చెర్ల మండలంలోని ఫరీద్‌పేటలో రాత్రి 2 గంటల వరకు డ్యూటీ చేసి వచ్చి పడుకుంటే.. తెల్లవారిజామున 4 గంటలకు ఫోన్ చేసి ఆవులు వ్యాన్ వస్తుందని అన్నారు. అప్పటికే నిద్రమత్తులో ఉన్నా ఫోన్ లిఫ్ట్ చేశాను. జేఆర్‌పురం పోలీసులు పట్టుకుని చెక్ చేశారు. ఆ పశువులు అలమండ సంతకు రైతులు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు.

అధికారుల అప్రమత్తతతో నష్ట నివారణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- పీజీఆర్ఎస్‌కు 104 వినతులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు అధికారులంతా అప్రమత్తంగా ఉండడంతో ఎటువంటి నష్టంజరగలేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని అభినందించారు. ప్లాస్టిక్‌ను నిషేధించేందుకు.. అధికారులంతా స్టీల్ వాటర్ బాటిల్ తీసుకొని రావాలన్నారు. తుఫాన్‌ల గూర్చి ముందుగానే సమాచారం ఉంటుందని, మూడు రోజులు ముందుగానే సమాచారం తెలియజేస్తే అందరూ జాగ్రత్త పడేందుకు అవకాశం ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారిని ఆదేశించారు.

వ్యాపారులు హాజరవ్వాలి

జీఎస్టీ 2.0పై ఆయన మాట్లాడుతూ ఈనెల 19వ తేదీన నిర్వహించనున్న జీఎస్టీ ఎగ్జిబిషన్‌కు అధికారులతో పాటు వ్యాపారులు హాజరవ్వాలని కోరారు. వ్యవసాయ పనిముట్లు, మెడికల్ ఇన్సూరెన్సు, నోట్‌బుక్స్ తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయా శాఖల అధికారులు షెడ్యూల్ ప్రకారం ప్రజలకు అవగాహన కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు సంబంధిత ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.

వినతుల స్వీకరణ

పీజీఆర్ఎస్‌లో భాగంగా మొత్తం 104 అర్జీలు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ – 28, మున్సిపల్ కార్పొరేషన్ – 16, పంచాయతీ రాజ్ – 15, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ – 8, ఏపీఈపీడీసీఎల్ – 7, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ – 4, హౌసింగ్ – 3, వాటర్ రిసోర్సెస్ – 3, పౌర సరఫరాల శాఖ – 2, సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ – 2, వ్యవసాయ శాఖ – 2, ప్రజా రవాణా శాఖ – 2, విభిన్న ప్రతిభావంతులు, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపులు, సాంఘిక సంక్షేమ శాఖ, రూరల్ డవలప్‌మెంట్, నైపుణ్యాభివృద్ధి, ఎస్సీ కార్పొరేషన్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పోలీసు, మెడికల్ ఎడ్యుకేషన్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, గిరిజన సంక్షేమ శాఖలకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరణలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కొన్ని వినతులు పరిశీలిస్తే...

- జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) ఆవరణలో జనరల్ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరిందని, దీని స్థానంలో కొత్త భవనం నిర్మించాలని శ్రీకాకుళం స్టూడెంట్ యూనియన్ ప్రతినిధులు బోర గోపి, ముకుందరావులు కోరారు.
- గుజరాతీపేటలోని లక్ష్మీ టాకీస్ వెనుకనున్న ప్రాంతంలో ఎక్కువగా మురుగు నీరు రోడ్లుపైనే ఉంటోందని, కాలువలు ఏర్పాటు చేయాలని వి.కాశీప్రసాద్, జి.కృష్ణారావు తదితరులు కోరారు.
- పాలకొండ కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేయాలని పాలకొండ జిల్లా సాధన సమితి సభ్యులు బుడితి అప్పలనాయుడు తదితరులు విన్నవించారు.
- ఎచ్చెర్ల సీడీపీవో పాపినాయుడు, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాసరావుపై జేసీ విచారణ చేసి 15 రోజులు కావస్తున్నా ఐసీడీఎస్ పీవో ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని బాలామృతం ట్రాన్సుపోర్టు కాంట్రాక్టర్ పైడి వెంకటరమణ రెండోసారి ఫిర్యాదు చేశారు.
- రణస్థలం మండలంలోని తెప్పలవలస గ్రామానికి చెందిన మేడూరి సత్యనారాయణమూర్తి తనకు వారసత్వంగా సక్రమించిన గ్రామకంఠం భూమిని 15 సంవత్సరాల క్రితం తన కుమార్తెకు రిజిస్ట్రేషన్ చేశాడు. అయితే ఆ భూమిని కొంత మంది వ్యక్తులు వీఆర్‌వో ధ్రువపత్రంతో అక్రమంగా వేరేవారికి అమ్మివేశారని, అందువలన తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు. గ్రామకంఠం భూమి క్రయవిక్రయాలకు వీఆర్‌వో ధ్రువపత్రం చెల్లదని, అయినా రిజిస్ట్రేషన్ చేశారని జేసీ వద్ద వాపోయారు.

క్లుప్తంగా

పిడుగుపాటుకు 13 మేకలు మృతి

శృంగవరపుకోట: మండలంలోని రేగ పుణ్యగిరిలో సోమవారం సాయంత్రం పిడుగు పడడంతో 13 మేకలు మృతి చెందాయి. కొండపై మేత మేస్తున్న సమయంలో పిడుగు పడడంతో మూగజీవాలు క్షణాల్లోనే చనిపోయాయని చెబుతూ పెంపకందారులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రభుత్వం బాధితులకు పరిహారం అందజేయాలని పలువురు కోరారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

పీఎం పాలెం: ఓ వ్యక్తి అనుమానాస్పద మృతిపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. స్థానిక సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. పార్వతీపురం మన్యం జిల్లా బాలగుడబ గ్రామానికి చెందిన ముచ్చల శివప్రసాద్ (54) భార్య పద్మజతో పీఎం పాలెం రామాలయం సమీపంలోని ఎల్ఐజీ క్వార్టర్స్‌లో నివసిస్తున్నారు. ఈయన ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నారు. శివప్రసాద్ ఈ నెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు స్వగ్రామానికి వెళ్తున్నానని భార్యకు చెప్పి, ఇంటి వద్ద బయల్దేరారు. సోమవారం ఉదయం 6.30 గంటలకు రామాలయం సమీపంలోని కల్వర్టు కింద మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. స్థానికంగా కలకలం రేగడంతో సంఘటన స్థలంలో పరిశీలించి, చనిపోయిన వ్యక్తి తన భర్త శివప్రసాద్‌గా పద్మజ గుర్తించింది. భర్త మరణంపై అనుమానం ఉందని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతుడు మద్యం వ్యసనపరుడని, సొంత ఊరులోని ఆస్తిపాస్తులు అమ్ముకున్నాడని పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

సంతకవిటి: మండల కేంద్రానికి చెందిన మెంటి దేవి (27) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ వి.రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రేగిడి మండలం పెద్దపుర్తి గ్రామానికి చెందిన ఎం.గోవిందరావు, మంగమ్మల కుమార్తె దేవికి సంతకవిటికి చెందిన మహేష్‌తో ఆరేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు. సెప్టెంబర్ 28న భర్త తాగి రావడంతో బెదిరించాలనే ఉద్దేశంతో దేవి పురుగు మందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు గుర్తించి రాజాంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా.. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 29న శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఎం.గోవిందరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పైడితల్లి పండుగకు ఆర్టీసీ సర్వీసులు

విజయనగరం అర్బన్: పైడితల్లి జాతర సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక సర్వీసులు నిర్విహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి జి. వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చేందుకు సోమవారం 40 బస్సులు వేయగా.. మంగళవారం 70, బుధవారం 30 బస్సులు తిప్పనున్నట్లు పేర్కొన్నారు. విశాఖ, సింహాచలం, అనకాపల్లి, శ్రీకాకుళం, చీపురుపల్లి, పాలకొండ, సాలూరు, పార్వతీపురం, ఎస్.కోట ప్రాంతాల నుంచి బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఆర్టీసీ సర్వీసులను వినియోగించుకోవాలని కోరారు.

వైభవంగా మహా పూర్ణాహుతి


ఉమా సదాశివాయంలో మహా పూర్ణాహుతి జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి దేవస్థాన క్షేత్ర పాలకులైన ఉమా సదాశివాలయంలో కామాక్షి అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా అమ్మవారి సన్నిధిలో మహా పూర్ణాహుతి కార్యక్రమం అత్యంత వైభవంగా చేపట్టారు. ప్రధానార్చకుడు మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో ముందుగా గణపతి పూజ నిర్వహించిన అనంతరం శివుడికి ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. అనంతరం కామాక్షి అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, స్వర్ణాభరణాలతో సుందరంగా అలంకరించి కుంకుమ పూజలు, అర్చనలు నిర్వహించారు. సుమారు మూడు గంటల పాటు హోమాలు చేపట్టి మహా పూర్ణాహుతి జరిపించారు. పూర్ణాహుతిలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, బడ్డుకొండ ప్రదీప్ నాయుడు, నగర పంచాయతీ వైస్ చైర్మెన్ కారుకొండ కృష్ణారావు, సర్పంచ్ అంబళ్ల కిరణ్, నాయకులు అట్టాడ శ్రీధర్, సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

జాతర చూసేందుకు ప్రత్యేక స్క్రీన్‌లు

విజయనగరం: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి జాతర మహోత్సవాన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు అవసరమైన పెద్ద స్క్రీన్ లను విజయనగరం నగరపాలక సంస్థ అధికారులు ఏర్పాటుచేశారు. మయూరి, అంబేడ్కర్ కూడలిలో స్క్రీన్‌లను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ నల్లనయ్య తెలిపారు.

సంబరం.. శుభారంభం

- అంగరంగ వైభవంగా తొలేళ్ల పండగ ● ఘటాలతో అమ్మవారిని దర్శించుకున్న భక్తజనం
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన అనువంశిక ధర్మకర్త
- అలరించిన వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు
- కోలాహలంగా మారిన చదురుగుడి, వనంగుడి
- నేటి మధ్యాహ్నం 3.05 గంటలకు సిరిమానోత్సవం ప్రారంభం


పూజలందుకుంటున్న పైడితల్లి అమ్మవారు


పైడితల్లి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

సాక్షిప్రతినిధి, విజయనగరం:

ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడితల్లి అమ్మవారి జాతరలో కీలక ఘట్టమైన తొలేళ్ల ఉత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి జాతరను తొలేళ్ల ఉత్సవంతో శ్రీకారం చుట్టారు. తొలిఏరుగా రైతులు జరుపుకునే పండగలో భాగంగా వేకువజామునుంచే అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజాధికాలను నిర్వహించగా పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సంప్రదాయం ప్రకారం ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవారికి పట్టువస్త్రాలు, సారెను సమర్పించారు. వేదపండితులు వేదమంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా ఆలయ సంప్రదాయం ప్రకారం పూజలు చేపట్టారు.

పైడితల్లి అమ్మవారిని తొలేళ్ల రోజున దర్శించుకున్న వారిలో...

జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, మాజీ డిప్యూటీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు కోలగట్ల వీరభద్రస్వామి, బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి చినవెంకట అప్పలనాయుడు తదితరులు పైడితల్లిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

ఘటాలతో నివేదన..

అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం నగరంలోని పలువురు భక్తులు వివిధ వేషధారణలతో... డప్పుల మోతలతో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. తొలేళ్ల ఉత్సవం రోజున ఉదయం నుంచి రాత్రి వరకూ సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఉచిత సేవలు

అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల సౌకర్యార్థం ఎన్‌సీసీ, రెడ్‌క్రాస్, పోలీస్ సేవాదళ్‌తో పాటు పలు స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు మంచినీరు, మజ్జిగ, ఆహారపొట్లాలను ఉచితంగా అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కలెక్టర్ రామ్ సుందర్‌రెడ్డి, ఎస్పీ దామోదర్ స్వీయపర్యవేక్షణ చేశారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు సిరిమాను రథాన్ని హుకుంపేట నుంచి పైడితల్లమ్మ వారి చదురుగుడి ప్రాంగణానికి తరలించేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. నిర్ణీత సమయానికి అమ్మవారి సిరిమానోత్సవం ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ గతంలో 2వేల మంది మాత్రమే బందోబస్తు విధులు నిర్వహించేవారని, ఈ ఏడాది 3వేల మందివరకూ సిబ్బందిని నియమించామన్నారు. డ్రోన్ కెమెరాలు, బాడీవార్న్ కెమెరాలు, మఫ్టీలో 70 మంది పోలీస్, ఏఆర్, బాంబ్ స్క్వాడ్, చెకింగ్, డాగ్ స్క్వాడ్ బృందాలు స్వీయపర్యవేక్షణ చేస్తున్నాయన్నారు.


పైడితల్లికి సారెను సమర్పిస్తున్న గోవా గవర్నర్, ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు దంపతులు


పైడితల్లిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు

సంప్రదాయబద్ధంగా ఉత్సవం

సోమవారం రాత్రి అమ్మవారి చదురుగుడి నుంచి ఘటాలతో నడుచుకుంటూ పూజారి వెంకటరావుతో పాటూ పలువురు పెద్దలు, దీక్షాపరులు కోటలో ఉన్న కోటశక్తికి పూజలు చేశారు. ఆరు ఘటాలను కోట వద్ద నుంచి తిరిగి చదురుగుడికి తీసుకెళ్లి అమ్మవారి చదురువద్ద పెట్టారు. సిరిమాను పూజారి వెంకటరావు అమ్మవారి కథను భక్తులకు వినిపించారు. అనంతరం రైతులకు విత్తనాలను అందజేసి, ఆశీర్వచనాలను అందజేశారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

నేడు సిరిమానోత్సవం

సిరులతల్లి సిరిమానోత్సవం మధ్యాహ్నం 12 గంటలకు హుకుంపేట నుంచి బయలు దేరనుంది. ఆలయం వద్దకు రెండు గంటల ప్రాంతానికి చేరు కుంటుంది. అక్కడ నుంచి సిరిమాను పనులను వడ్రంగులు, నిపుణులు పర్యవేక్షిస్తారు. ముహూర్తం ప్రకారం 3.05 గంటలకు సిరిమాను బయలు దేరుతుందని సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు వెల్లడించారు.

తక్కువ ధరకే బంగారం పేరిట మోసం

- రూ. 12 లక్షలు కాజేసిన వైనం
- నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న పార్వతీపురం రూరల్ సీఐ రంగనాథం


స్వాధీనం చేసుకున్న రూ. 12 లక్షల నగదు

పార్వతీపురం రూరల్: తన భార్యకు విద్యాబుద్ధులు చెప్పిన టీచర్‌నే మోసం చేశాడు ఓ ప్రబుద్ధుడు. ఆమె బలహీనతను ఆసరాగా చేసుకొని ఏకంగా రూ. 12 లక్షలు కాజేశాడు. తక్కువ ధరకే బంగారాన్ని ఇప్పిస్తానంటూ నమ్మించి నిలువునా ముంచేసిన ఈ కేటుగాడితో పాటు మరో 8 మంది సభ్యుల ముఠాను పార్వతీపురం రూరల్ పోలీసులు చాకచక్యంగా పట్టుకొని కేసును ఛేదించారు.

అసలేం జరిగిందంటే...

శ్రీకాకుళానికి చెందిన ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మి గతంలో శ్రీకాకుళం రూరల్ మండలం సింగువలస వద్ద పనిచేసే సమయంలో నిందితుడు కొత్తూరు మండలం గొట్టుపల్లి పంచాయతీ పుల్లగూడకు చెందిన జి. రిషివర్ధన్ భార్య చదువుకునేది. దీంతో ప్రధానోపాధ్యాయురాలితో రిషివర్ధన్‌కు పరిచయం ఉంది. ఈ క్రమంలో తాను బంగారం వ్యాపారం చేస్తున్నానని.. చాలా తక్కువ ధరకే నాణ్యమైన బంగారు బిస్కెట్లు ఇప్పించగలనని ప్రధానోపాధ్యాయురాలిని నమ్మబలికాడు. అతని మాయమాటలు నమ్మిన ఆమె ఈ ఏడాది ఆగస్టు 11న రూ. 12 లక్షల నగదు పట్టుకుని బంగారం కొనేందుకు శ్రీకాకుళం నుంచి పార్వతీపురం వైపు రిషివర్ధన్‌తో వస్తుండగా.. ముందస్తుగా వేసుకున్న స్కెచ్ ప్రకారం పార్వతీపురం శివారులో వాటర్ పంప్‌హౌస్ సమీపంలో కొంతమంది వ్యక్తులు హఠాత్తుగా వచ్చి వీరిని భయభ్రాంతులకు గురిచేసి లక్ష్మి చేతిలో ఉన్న నగదు తీసుకుని పరారయ్యారు. వెంటనే బాధితురాలు పార్వతీపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పక్కా స్కెచ్‌తో పట్టించారు..

ఫిర్యాదు అందుకున్న వెంటనే రంగంలోకి దిగిన పార్వతీపురం సీఐ రంగనాథం, రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి పక్కా వ్యూహంతో ఈ అంతర్ జిల్లా ముఠా గుట్టు రట్టు చేశారు. ముందుగా రిషివర్ధన్ కదలికలపై నిఘా పెట్టి ప్రధాన నిందితుడు అతనే అని నిర్ధారణకు వచ్చారు. అతనితో పాటు పార్వతీపురం, సాలూరు, విజయనగరం, ఒడిశాకు చెందిన మొత్తం 8 మందిని సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 12 లక్షల నగదుతో పాటు కారు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

గోల్డ్‌స్టార్ జంక్షన్ వద్ద విధ్వంసం

- కోర్టు తీర్పు ఉందంటూ జేసీబీలతో ఇళ్లు నేలమట్టం
- పోలీసులను ఆశ్రయించిన ఇరువర్గాలు


జేసీబీల సాయంతో కూల్చేసిన ఇళ్లు

లక్కవరపుకోట: కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని చెబుతూ మండలంలోని గోల్డ్ స్టార్ జంక్షన్ వద్ద గల ఇళ్లను మూడు జేసీబీలతో నేలమట్టం చేసి విధ్వంసం సృష్టించిన సంఘటన సోమవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, ఎస్సై నవీన్ పడాల్ తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మల్లివీడు రెవెన్యూ పరిధి గోల్డ్‌స్టార్ జంక్షన్ వద్ద గల 30 సెంట్ల భూమికి సంబంధించి రెల్లిగౌరమ్మపేట గ్రామానికి చెందిన పినిశెట్టి కిష్టప్పదొర, గేదెల అప్పన్నదొరల మధ్య 2015 సంవత్సరం నుంచి వివాదం నడుస్తోంది. సదరు స్థలంలో మూడు కుటుంబాల వారు ఇళ్లు నిర్మించుకోవడంతో పాటు 9 షాపులు నిర్మించుకుని చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో గత నెల 27న అప్పన్నదొరకు అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చిందని అప్పన్నదొర తమ్ముడు ప్రముఖ వైద్యుడు గేదెల రాము తెలిపారు. ఈ మేరకు నాలుగు రోజుల కిందట సంబంధిత జడ్జిమెంట్ అంశాన్ని స్థానిక ఎస్సై నవీన్ పడాల్‌కు తెలియజేసి వివాదా స్థలంలో గల కబ్జాలను తొలిగించేందుకు సహకరించాలని రాము కోరారు. దీంతో శాశ్వత జడ్జిమెంట్ వస్తే తప్పనిసరిగా సహకరిస్తానని ఎస్సై బదులిచ్చారు. ఇంతలోనే రాము విశాఖపట్నం, ఎస్.కోట ప్రాంతాలకు చెందిన కిరాయి వ్యక్తులను సుమారు 30 మందిని తీసుకువచ్చి మూడు జేసీబీల సహాయంతో సోమవారం తెల్లవారు జామున ఇళ్లను, షాపులను కూల్చేశారు. విషయం తెలుసుకున్న పినిశెట్టి కిష్టప్పదొర సంఘటనా స్థలానికి వచ్చేసరికి కిరాయి వ్యక్తులు అతనిపై దాడికి దిగారు. ఇంతలో రెల్లిగౌరమ్మపేట గ్రామానికి చెందిన యువకులు సంఘటనా స్థలానికి రావడంతో కిరాయి వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించారు. దీంతో యువకులు వారిని వెంబడించి కొంతమందిని పట్టుకుని, జేసీబీలతో సహా పోలీసులకు అప్పగించారు. దీంతో ఇరువర్గాలూ ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకున్నారు.

కూటమి నేతల అండతోనే..

వివాదానికి సంబంధించిన స్థలంలో గడిచిన 40 సంవత్సరాలుగా 9 కుటుంబాల వారు చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కోర్టు తీర్పు వచ్చిందని హడావిడిగా జేసీబీలతో ఇళ్లు, షాపులును కూల్చేశారని బాధితులు వాపోయారు. కనీసం సామాన్లు తీసుకునేందుకు కూడా అవకాశం ఇవ్వలేదని.. కూటమి నాయకుల అండతోనే ఇదంతా జరిగిందని ఆరోపిస్తున్నారు.

అయ్యో పసికూన.. ఎక్కడున్నావమ్మా..!

- మృతి చెందిన గున్నఏనుగు కోసం తల్లడిల్లుతున్న ఏనుగుల గుంపు
- రోజంతా గున్నఏనుగు మృతిచెందిన చెరువు వద్దే సంచారం


ముదిరాజు చెరువు గట్టుపై ఉన్న ఏనుగుల గుంపు

పార్వతీపురం రూరల్: గుంపులో జాగ్రత్తగా చూసుకుంటున్న గున్నఏనుగు మృతితో ఏనుగుల గుంపు తల్లడిల్లుతోంది. ఏనుగు పిల్ల మృతి చెందిన లక్ష్మీనారాయణపురం సమీపంలోని ముదిరాజు చెరువు వద్దనే సోమవారం వెతుకులాడాయి. చెరువులో దిగిన గున్నఏనుగు తిరిగి ఒడ్డుకు చేరకపోవడంతో చెరువు వైపే చూస్తున్నాయి. ఈ దృశ్యాలు స్థానికులను కంటతడి పెట్టిస్తున్నాయి. పార్వతీపురం మండలంలోని పెదమరికి, చినమరికి, కృష్ణపల్లి, లక్ష్మీనారాయణపురం తదితర గ్రామాల్లో కొద్ది రోజులుగా సంచరిస్తున్న ఏనుగుల గుంపు ఆదివారం ముదిరాజు చెరువులో దిగాయి. వీటిలో ఏడు నెలల వయస్సు ఉన్న (జూనియర్ హరి) గున్న ఏనుగు కూడా ఉంది. కొంత సమయం చెరువులో ఉన్న ఏనుగులు తిరిగి ఒడ్డుకు చేరుకుని పొలాల్లోకి వెళ్లిపోయాయి. గుంపులో గున్న ఏనుగు కనిపించకపోవడాన్ని గమనించి తిరిగి చెరువు వద్దకు చేరుకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు గున్న ఏనుగు మృతి చెందిన చెరువు పరిసర ప్రాంతాల్లోని, చెరువులో వెతుకులాట చేస్తూ గాలించాయి.

ఏనుగులతో జాగ్రత్త..

గున్న ఏనుగు మృతితో తల్లడిల్లుతున్న ఏనుగుల గుంపు ఆందోళన కరంగా ఉండే అవకాశం ఉంది. ఏనుగులు సంచరిస్తున్న సమాచారాన్ని అటవీ శాఖ సిబ్బంది నుంచి తెలుసుకొని వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు జాగ్రత్తలు పాటించాలని, అత్యుత్సాహంతో ఏనుగులు సంచరిస్తున్న సమీప ప్రాంతాలకు వెళ్లరాదని అటవీశాఖ సిబ్బంది, అధికారులు స్థానికులను హెచ్చరిస్తున్నారు.

కోరుకొండ సైనిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

విజయనగరం రూరల్: యూపీఎస్సీ పరీక్షల్లో కోరుకొండ సైనిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఇండియన్ నావల్ అకాడమీ రాత పరీక్షల్లో మొత్తం 54 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వారిని ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శాస్త్రి అభినందించారు. భారత సాయుధ దళాలకు భవిష్యత్ నాయకులను అందించడంలో కోరుకొండ సైనిక్ స్కూల్ నిబద్ధతకు ఇది నిలువెత్తు నిదర్శనమని ప్రిన్సిపాల్ సంతోషం వ్యక్తం చేశారు.

అలసత్వాన్ని సహించేది లేదు

విజయనగరం అర్బన్: గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన తన చాంబర్ నుంచి ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులతో పారిశుధ్యం, సూపర్ జీఎస్టీ కాంపెయిన్, ఎరువుల సరఫరా అంశాలపై నిర్వహించిన టెలీకాన్ఫెరెన్స్‌లో ఈ మేరకు పేర్కొన్నారు.

గ్రామాల్లో పండుగలు కొనసాగుతున్న దృష్ట్యా రక్షిత తాగునీటిని సరఫరా చేయాలని, కలుషిత నీరు, ఆహారం తీసుకోవద్దని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతిరోజూ పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. సూపర్ జీఎస్టీ క్యాంపెయిన్‌లో భాగంగా షెడ్యూల్‌లో ఇచ్చిన లక్ష్యాల మేరకు ఏ రోజు కార్యక్రమాలను ఆ రోజే పూర్తి చేయాలని ఆదేశించారు.

విజయనగరం విజయదుందుభి


విజేతగా నిలిచిన విజయనగరం జిల్లాకు చెందిన బాలురు, బాలికల జట్లు

- రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో బాల, బాలికల జట్లకు ప్రథమ స్థానం

గొలుగొండ: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజయనగరం విజయదుందుభి మోగించింది. అండర్-14 బాల, బాలికల విభాగాల్లో హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లలో ఈ జిల్లా జట్లు ప్రథమ స్థానం సాధించాయి. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణదేవిపేట గ్రామ హైస్కూల్‌లో ఈ నెల 4న ప్రారంభమైన పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి బాల, బాలికల జట్లు పాల్గొన్నాయి. సోమవారం నిర్వహించిన ఫైనల్ పోటీల్లో విజయనగరం, గుంటూరు బాలుర జట్లు తలపడ్డాయి. ఇందులో 2 పాయింట్లు తేడాతో విజయనగరం జట్టు విజేతగా నిలిచింది. గుంటూరు జట్టు ద్వితీయ స్థానానికి పరిమితమైంది. అనంతరం బాలికల పోరులో విజయనగరం, చిత్తూరు జట్లు తలపడ్డాయి. నువ్వా నేనా అన్నట్టుగా సాగిన ఈ పోటీలో విజయనగరం బాలికలదే పై చేయి అయింది. ఒక పాయింట్ తేడాతో విజేతగా నిలిచింది. చిత్తూరు జట్టు ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది. ఈ సందర్భంగా గెలుపొందిన జట్లకు నర్సీపట్నం టౌన్ సీఐ గోవిందరావు, కృష్ణదేవిపేట పూర్వపు ఎస్ఐ తారకేశ్వరరావు, సాఫ్ట్‌బాల్ నిర్వహణ ప్రతినిధులు రమణ, శ్రీనివాసరావు, సుమంత్‌రెడ్డి, సూర్యదేముడు, సతీష్, భవానీ, చంద్రమోహన్ బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు.

అర్జీదారుల సంతృప్తే లక్ష్యం

- కలెక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రభాకర రెడ్డి

పార్వతీపురం రూరల్: అర్జీదారుల సంతృప్తే లక్ష్యం కావాలని కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి అన్నారు. సమస్యలు తెలియజేస్తే పరిష్కారమవుతాయనే నమ్మకం అర్జీదారులకు కలిగించాలని అధికారులను సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జేసీ సి. యశ్వంత్‌కుమార్ రెడ్డితో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జీదారుల నుంచి సుమారు వంద వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రెవెన్యూ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్‌లను ఏర్పాటు చేశామన్నారు. వీలైనంతవరకు అర్జీదారుని సమక్షంలోనే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇరవై రోజులుగా 50 ఎకరాలకు సంబంధించిన వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా లేదని, వెంటనే సమస్య పరిష్కరించాలని గరుగుబిల్లి మండలం సుంకి పంచాయతీకి చెందిన రైతులు వినతి అందజేశారు. అలాగే తమ గ్రామంలో రేషన్ బియ్యం అక్రమంగా రవాణా.. ఉపాధి నిధులు దుర్వినియోగం.. క్షీణించిన పారిశుధ్యంపై వీరఘట్టం మండలం చలివేంద్రి గ్రామానికి చెందిన రామినాయుడు ఫిర్యాదు చేశారు. మార్కెట్ స్థలాన్ని కొందరు ఆక్రమించి రెవెన్యూ రికార్డులు తారుమారు చేశారని జియ్యమ్మవలస మండలం చినమేరంగి గ్రామానికి చెందిన బెహరా కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎం. సుధారాణి, అన్నిశాఖల జిల్లాస్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు 19 వినతులు..


వినతులు స్వీకరిస్తున్న ఏపీఓ చిన్నబాబు

సీతంపేట: ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 19 వినతులు వచ్చాయి. ఏపీఓ చిన్నబాబు అర్జీదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గుమ్మడ – ఇప్పగూడ గ్రామాలకు రహదారి మంజూరైనా ఇప్పటి వరకు నిర్మాణాలు చేపట్టని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. పాలకొండ – కోతాం బస్సు వేయాలని గిరిజనులు కోరారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదునూ పరిష్కరించాలి

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: అర్జీదారులు తెలియజేసిన ప్రతి సమస్యనూ పరిష్కరించాలని ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రుల వేధింపులు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ, ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమ పేరిట మోసాలపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా విన్న ఎస్పీ వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ ఆదాం, ఎస్సై రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.